బడంగ్‌పేట్‌లో ఫుడ్ సేఫ్టీ విభాగం ఏది ?

హోటళ్లలో పాచిపోయిన ఆహార పదార్థాలు

- నిల్వ ఉంచిన మాంసాహారం వేడి చేసి వడ్డిస్తున్న నిర్వాహకులు
- తనిఖీల మాట ఎత్తని మునిసిపల్ అధికారులు, పాలకులు


ఇటీవల బడంగ్‌పేట్‌లోని ఈ హోటల్ నుంచి పార్సిల్ తెచ్చుకున్న ఆహారం తిని ముగ్గురు యువకులు ఆస్పత్రి పాలయ్యారు


బడంగ్‌పేట్‌లోని ఓ హోటల్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

సరూర్‌నగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కుళ్లిన కూరగాయలు.. పాచిపోయి, బూజు పట్టిన మాంసాహారం.. తినడానికి పనికిరాని ఆహార పదార్థాలు.. మురికి నీటిలోనే ప్లేట్లు, గ్లాసులు శుభ్రం.. ఇవీ బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని అనేక హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బార్లు, బేకరీల్లో కనిపిస్తున్న దృశ్యాలు! అయినా మునిసిపల్ అధికారులుగానీ, ప్రజా ప్రతినిధులుగానీ వాటి వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దాంతో వాటి నిర్వాహకులు ఇష్టానుసారంగా ఆహారం సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

అసలు ఫుడ్ సేఫ్టీ విభాగం ఉందా..?

విచిత్రమేమిటంటే.. అసలు బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో ప్రత్యేకంగా ఫుడ్ సేఫ్టీ విభాగమే లేకపోవడం! కేవలం కమిషనర్‌గానీ, శానిటేషన్ విభాగం అధికారులుగానీ తనిఖీలు చేయాల్సిన పరిస్థితి ఇక్కడ నెలకొంది. సదరు అధికారులు రోజువారీ విధుల్లో బిజీగా ఉంటుండడంతో హోటళ్లలో తనిఖీలకు సమయం ఉండడం లేదు. ఇక ప్రజాప్రతినిధులు సైతం తనిఖీలపై దృష్టి పెట్టడం లేదు. దాంతో ఏ హోటల్‌లో చూసినా దుర్గంధం వెదజల్లే అపరిశుభ్రత, కిచెన్‌లో పాడైపోయిన కూరగాయలు, బూజు పట్టిన మాంసాహారం కనిపిస్తున్నాయి. కల్తీ నూనెతో పాటు ఇతర వస్తువులను సైతం కల్తీవే వాడుతున్నట్టు తెలుస్తోంది. వాటిని తిని ప్రజలు తమ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇక్కడ ఫుడ్ సేఫ్టీ విభాగం లేకపోవడంతో ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. స్థానిక మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేస్తే.. వాళ్లు నిర్వాహకులతో మిలాఖత్ అయి తనిఖీలకు వెళ్లడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఆహార పదార్థాల కల్తీ, నిల్వ పదార్థాల సరఫరాపై దృష్టి పెట్టి, నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నగర పంచాయతీగా ఉన్నప్పుడు తనిఖీలు.. మళ్లీ ఆ ఊసే లేదు

బడంగ్‌పేట్ గతంలో నగర పంచాయతీగా ఉన్నప్పుడు అప్పటి మునిసిపల్ అధికారులు స్థానిక హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీల్లో తరచుగా తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించేవారు. ప్లాస్టిక్ నిషేధంపైనా దృష్టి పెట్టేవారు. హోటళ్లలోని ఆహార పదార్థాలను పరిశీలించి, పాడైనవి ఉంటే నిర్వాహకులను మందలించేవారు. అయితే బడంగ్‌పేట్ కార్పొరేషన్‌గా మారిన తర్వాత గడిచిన ఐదేళ్లలో ఆ దిశలో చర్యలు తీసుకున్న దాఖలాలే లేవు. ఈ ఐదేళ్లలో ఐదారుగురు కమిషనర్లు మారినా, కొత్తగా పాలకవర్గం కొలువుదీరినా.. ఎవరూ కూడా తనిఖీలు ఊసే ఎత్తడం లేదు. హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లు, బేకరీల నుంచి నెలవారీ మామూళ్లు తీసుకుని తనిఖీల విషయాన్ని పక్కనబెట్టినట్టు ఆరోపణలు వినవస్తున్నాయి.

హోటల్ ఫుడ్ తిని ఆస్పత్రిపాలు

బడంగ్‌పేట్ ప్రధాన రహదారిలోని ఓ రెస్టారెంట్ నుంచి ఆరు రోజుల క్రితం మ్యాజిక్ పిన్ అనే యాప్ ద్వారా బిర్యానీ, గ్రిల్ చికెన్ తెప్పించుకున్న మీర్‌పేట్‌కు చెందిన ముగ్గురు యువకులు.. అవి తిన్న తర్వాత వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిపాలయ్యారు. దీనిపై వారు జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఇంత వరకు ఏ అధికారీ సదరు హోటల్‌లో తనిఖీలు జరుపలేదు. స్థానిక అధికారులు సైతం పట్టించుకోలేదని బాధితులు ఆరోపిస్తున్నారు.


కళాసిల్క్స్ చేనేత వస్త్ర, హస్త కళల ప్రదర్శనలో వస్త్రాలను తిలకిస్తున్న మహిళలు

ఆకట్టుకుంటున్న కళాసిల్క్స్ చేనేత వస్త్ర, హస్త కళల ప్రదర్శన

ఎల్బీనగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అల్కాపురి కమ్యూనిటీహాల్‌లో కళాసిల్క్స్ చేనేత వస్త్ర, హస్త కళల ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే పోచంపల్లి వస్త్రాలతో పాటు వివిధ రకాల వస్త్రాలు, బెడ్‌షీట్‌లు, బెంగాల్‌శారీస్, రాజస్థానీ కోటా శారీస్, మంగళగిరి, ఉప్పాడ, చీరాల, వెంకటగిరి, ధర్మవరం, కలంకారీ చేనేత డ్రెస్ మెటీరియల్, లక్నో చికన్‌వర్క్ కుర్తీలు, వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలతో పాటు యువత మెచ్చే చీరలు, ఇతర మెటీరియల్స్ ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచామని నిర్వాహకులు వికాస్ జైన్ తెలిపారు. ఈ ప్రదర్శన డిసెంబర్ 20 వరకు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు తెరిచే ఉంటుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.


డ్రైనేజీ సమస్యను అధికారులకు చూపిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

సమస్యలు లేని డివిజన్‌గా లింగోజిగూడను తీర్చిదిద్దుతా

- జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి

ఎల్బీనగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సమస్యలు లేని డివిజన్‌గా లింగోజిగూడను తీర్చిదిద్దుతామని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం లింగోజిగూడ డివిజన్ పరిధిలోని మసీద్ గల్లీలో ఆయన పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రతికాలనీ, బస్తీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. గతంలో ఉన్న డ్రైనేజీ పైపులైన్ల స్థానంలో పెద్దవి వేయించిన తర్వాత సీసీరోడ్డు నిర్మాణ పనులు చేయిస్తున్నామన్నారు. ఎక్కడ సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు చేపడతానన్నారు. కార్యక్రమంలో జలమండలి ఏఈ పవిత్ర, కాలనీ ప్రతినిధులు శ్రీధర్‌గౌడ్, జీవన్‌రెడ్డి, రాములుగౌడ్, కృష్ణ, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, నరేందర్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించాలని కమిషనర్‌కు వినతి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాంబాబుయాదవ్

అబ్దుల్లాపూర్‌మెట్ : పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ పరిధిలోని సర్వే నంబర్ 68, 69, 70, 71, 278/1, 2, 3లో వెలుస్తున్న అక్రమ కట్టడాలను తొలగించాలని రేణుక హోమ్స్ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ రాంబాబుయాదవ్ కమిషనర్ రవీందర్‌రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. సర్వే నంబర్ 278/1లో కొన్ని ఏళ్ల క్రితం భూదాన బోర్డు లబ్ధిదారులకు పట్టాలను ఇచ్చిందన్నారు. అయితే కొంత మంది అక్రమార్కులు నకిలీ భూదాన్ పట్టాలతో తాము లేఅవుట్ చేసిన పట్టా భూమిలోకి వచ్చి అక్రమంగా రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకపోగా తమ పట్టా భూముల్లో కడుతున్న నిర్మాణాలను తొలగించాలని ఆయన కమిషనర్‌ను కోరారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'వృక్షాలను కొట్టివేసిన వ్యక్తిపై చర్య తీసుకోండి'

సైదాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కారు పార్కింగ్ కోసం ఫుట్‌పాత్‌పై ఉన్న నాలుగు వృక్షాలను కొట్టివేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ బీజేపీ నేత సంగోది పరమేష్‌కుమార్ బుధవారం జీహెచ్‌ఎంసీ, ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. సైదాబాద్ కాలనీలోని సూర్యప్రభ అపార్ట్‌మెంట్ ముందు ఫుట్‌పాత్‌పై శర్మ అనే వ్యక్తి కారు పార్కు కోసం నాలుగు వృక్షాలను కూలీలతో కొట్టివేసి పార్కింగ్ ప్రదేశంగా తయారు చేశారని పేర్కొన్నారు. ఈ విషయంపై అపార్ట్‌మెంట్ వాసులు ప్రశ్నించగా దురుసుగా వ్యవహరించారని తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

చొరబాటుదారులను అరికట్టాలి : కార్పొరేటర్


ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్

ఎల్బీనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్, అంబేడ్కర్ నగర్‌లలో అక్రమ చొరబాట్లను అరికట్టాలని స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ కోరారు. బుధవారం సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. బంగ్లాదేశీయుల అక్రమ చొరబాటుతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ చొరబాట్లను అరికట్టి స్థానికులకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలని ఆమె కోరారు. క్రమం తప్పకుండా కార్డన్‌సెర్చ్ నిర్వహించాలని ఆమె కోరారు.


సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషి : రాగుల

వనస్థలిపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం వనస్థలిపురం డివిజన్ క్రాంతిహిల్స్‌కాలనీలో కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ పాదయాత్ర నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రాంరెడ్డి, సాయికిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుల పరిశుభ్రతకు కృషి చేయాలి : లచ్చిరెడ్డి


పార్కును సందర్శిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పార్కుల పరిశుభ్రతకు సంబంధిత అధికారులు కృషి చేయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద పార్కులో కొద్ది రోజులుగా చెత్త, చెట్ల కొమ్మలను తొలగించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు చెప్పినా ఆ చెత్తను తొలగించకపోవడంతో కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకవచ్చారు. ఈ మేరకు బుధవారం కార్పొరేటర్ పార్కును పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని పార్కుల పరిశుభ్రతకు సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ మేనేజర్ మేధ తక్షణమే డివిజన్‌లోని పార్కుల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

'క్రిడా'లో ప్రాంతీయ కన్సల్టేషన్ వర్క్‌షాప్


ప్రాంతీయ కన్సల్టేషన్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న శాస్త్రవేత్తలు

సంతోష్‌నగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రెసిలెంట్ బేసిన్ డెవలప్‌మెంట్ కై క్యాచ్‌మెంట్ రెసిలెన్స్ ఇండెక్స్ డెవలప్‌మెంట్‌పై రెండు రోజుల పాటు సంతోష్‌నగర్‌లోని కేంద్రియ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ(క్రిడా)లో నిర్వహించిన ప్రాంతీయ కన్సల్టేషన్ వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోదావరి రివర్ మేనేజ్మెంట్ బోర్డు చైర్మన్ డాక్టర్ ముఖేష్‌కుమార్ సిన్హా విచ్చేశారు. ఈ సందర్భంగా ఐసీఏఆర్-క్రిడా ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎస్‌కే బాల్ ఓవర్‌వ్యూను, అదేవిధంగా ఐడబ్ల్యూఎంఐ ప్రతినిధి డాక్టర్ అలోక్ సిక్కా వర్క్‌షాప్ ప్రాధాన్యతను గురించి ముఖేష్‌కుమార్ సిన్హాకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఆర్ఐ ఇండెక్స్ అభివృద్ధితో గోదావరి బేసిన్ నిర్వహణకు చాలా ఉపయోగపడుతుందని, దీని అభివృద్ధిలో తన సహకారం ఉంటుందన్నారు. సీఆర్ఐ అభివృద్ధి అనేది ఐసీఏఆర్, దాని కేంద్ర క్రిడా, ఐడబ్ల్యూఎంఐ సహకారంతో దేశంలో వ్యవసాయ విపత్తు రిస్క్ మేనేజ్మెంట్ స్ట్రాటజీతో పెరుగుతున్న వ్యవసాయ స్థితిస్థాపకతను ప్రోత్సహించేందుకు అంతర్జాతీయ స్థాయిలో నీటి నిర్వహణ సంస్థతో అమలు చేయబడిన విస్తృత చొరవలో భాగమన్నారు. సమీకృత క్లైమేట్ రిస్క్ మేనేజ్మెంట్‌కు మార్గనిర్దేశం చేసేందుకు క్యాచ్‌మెంట్ ప్లానింగ్, పునరావాసంకు సీఆర్ఐ యొక్క ప్రాముఖ్యతపై విభిన్న వాటాదారులతో ఒక వినూత్న సహరూపకల్పన, సహఅమలు ప్రక్రియను అభివృద్ధి చేయడం ప్రాజెక్టు లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో 42 మంది సంబంధిత సంస్థల వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

- పార్టీ కార్యకర్తలకు మాజీ హోంమంత్రి మహమూద్‌అలీ విజ్ఞప్తి


మాట్లాడుతున్న మాజీ హోంమంత్రి మహమూద్‌అలీ

చాదర్‌ఘాట్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఈనెల 29న నిర్వహించబోయే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని మాజీ హోం మంత్రి మహమూద్‌అలీ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆజంపురలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో జరిగిన మలక్‌పేట నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 11 రోజుల పాటు దీక్ష చేపట్టి ప్రాణత్యాగానికి సిద్ధమైన కేసీఆర్ లాంటి మహనాయకుడికి సాటి మరొకరు లేరని కొనియాడారు. ఈనెల 29 నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు 11 రోజుల పాటు దీక్షా దివస్ కార్యక్రమం సందర్భంగా మలక్‌పేట నియోజకవర్గంలో పలు కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. అందులో భాగంగానే ఈనెల 29న మలక్‌పేట నియోజవర్గంలోని అక్బర్‌బాగ్‌లో గల దిల్‌కుశ ఫంక్షన్‌హాల్‌లో చావునీ డివిజన్ పార్టీ అధ్యక్షుడు హయత్ హుస్సేన్ హబీబ్ ఆధ్వర్యంలో రక్తదాన, కంటి పరీక్షా శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు మహమూద్‌అలీ వివరించారు. 11రోజుల పాటు జరగబోయే దీక్షా దివస్ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ వాదులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని బీఆర్‌ఎస్‌కు మద్దతుగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నగర కార్యదర్శి ఆజంఅలీ, మలక్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జి తీగల అజిత్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కొరుదు భూమేష్, మాజీ డైరెక్టర్లు చిన్నయ్య నరేష్, యాదగిరి, రవీందర్‌రెడ్డి, టి.శ్రీనివాస్‌రావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రసాద్ సేవలు చిరస్మరణీయం


సీపీఐ ఖమ్మం కార్యదర్శి పోటు ప్రసాద్ చిత్ర పటానికి నివాళ్లు అర్పిస్తున్న ఎల్బీనగర్ కార్యదర్శి శేఖర్‌రెడ్డి తదితరులు

హయత్‌నగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వాకింగ్ చేస్తూ అకస్మాత్తుగా మృతిచెందిన సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ చిత్ర పటానికి ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి నివాళ్లు అర్పించారు. బుధవారం సీపీఐ హయత్‌నగర్ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంతాప కార్యక్రమంలో ఆయన పాల్గొని నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పోటు ప్రసాద్ కీలకంగా వ్యవహరించారని కొనియాడారు. పార్టీకి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి శ్రీదేవి, సహాయ కార్యదర్శి శోభన్, అరుణ్‌కుమార్, సక్రునాయక్, వంశీవర్ధన్‌రెడ్డి, సుజాత, అరుణ, వెంకట్ పాల్గొని నివాళ్లు అర్పించారు.

ప్రసాద్ మరణం సీపీఐకి తీరనిలోటు

అబ్దుల్లాపూర్‌మెట్ : ఖమ్మం జిల్లా సీపీఐ కార్యదర్శిగా పనిచేస్తున్న పోటు ప్రసాద్ ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి అన్నారు. ఆయన మరణం బాధాకరం అన్నారు. బుధవారం కుంట్లూర్ ఆర్‌ఎన్‌ఆర్ కాలనీలో ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీకి ఆయన చేసిన సేవలను మరువలేమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి, పబ్బతి లక్ష్మణ్, అజ్మీర్ హరిసింగ్‌నాయక్, మధు, పుల్లయ్య, ప్రసాద్, నిరంజన్, యాదగిరి, దేవమ్మ, సుజాత, వినోద్, శ్రావణి పాల్గొన్నారు.

నేడు ఆజంపురలో క్లాక్ టవర్ ప్రారంభోత్సవం

చాదర్‌ఘాట్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆజంపురలో కనువిందు చేయనున్న భారీ క్లాక్ టవర్ గురువారం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల చేతుల మీదుగా ఆజంపుర డివిజన్‌లో రూ.3.54కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. అందులో భాగంగా రూ.1.60కోట్ల వ్యయంతో ఆజంపుర చౌరస్తాలో నిర్మించిన భారీ క్లాక్ టవర్, దాని చుట్టూ గ్రీనరీ, ఆజంపుర ఆర్‌యూబీ రెండు ద్వారాల కిరువైపులా వర్టికల్ గార్డెన్ కూడా ప్రారంభమై ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. వీటితో పాటు పలు చోట్ల సీసీ రోడ్లు, నూతన కమ్యూనిటీహాల్‌లను కూడా ప్రారంభించనున్నారు.

24 గంటల్లో మందకృష్ణ మాదిగకు క్షమాపణ చెప్పకుంటే వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం


మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ నాయకులు

ఓల్డ్‌మలక్‌పేట : వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య మందకృష్ణ మాదిగపై చేసిన అసత్య ఆరోపణలను తీవ్రంగా కండిస్తున్నామని ఇరవై నాలుగు గంటల్లో ఆయన క్షమాపణ చెప్పకుంటే వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) నేషనల్ కోర్‌కమిటీ చైర్మన్ ఎల్ గోపాల్‌రావు, వైస్ చైర్మన్ అందె రాంబాబు, జాతీయ మహిళా అధ్యక్షురాలు సుజాతసూర్యవంశీలు హెచ్చరించారు. బుధవారం మలక్‌పేటలోని వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తొత్తుగా మారి చైర్మన్ పదవి పొందిన వీరయ్య వికలాంగుల సమస్యలు మరిచిపోయి మందకృష్ణపై లేనిపోని ఆరోపనలు చేస్తున్నాడని ఇలాగే నోటికి వచ్చినట్లు మాట్లాడితే నాలుక కోస్తామని హెచ్చరించారు. రాష్ట్రప్రభుత్వం వికలాంగులకిచ్చిన హామీలు నెరవేర్చనందున డిసెంబర్ 3న జరిగే జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని జరగకుండా అడ్డుకుంటామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తికావస్తున్నా వికలాంగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని వికలాంగుల కోసం మందకృష్ణ ధర్నా చేయడం తప్పా అని ప్రశ్నించారు. సమావేశంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ళ జంగయ్య, మహిళా అధ్యక్షురాలు మంగమ్మ, గోవర్ధన్ పాల్గొన్నారు.

నల్లా బిల్లు ఓటీఎస్‌కు స్పందన కరువు

- మరో రెండురోజులే గడువు

ఓల్డ్‌మలక్‌పేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తాగునీటి నల్లా బకాయి బిల్లులు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీం(ఓటీఎస్)కు ఈనెల 30వ తేదీతో గడువు ముగుస్తుంది. ఏళ్ల తరబడి బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో ఉన్న బకాయిలు రాబట్టుకునేందుకు అక్టోబర్ ఒకటి నుంచి 30వ తేదీ వరకు ఓటీఎస్ ప్రవేశపెట్టారు. అనుకున్నమేర బిల్లులు వసూలు కాకపోవడంతో నవంబర్ 30 వరకు ఓటీఎస్ పొడిగిస్తూ ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది. ఇంకా రెండు రోజులే గడువు మిగిలింది.

స్పందన కరువు..

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటీఎస్‌కు మలక్‌పేట డివిజన్ ప్రజల నుంచి స్పందన కరువైంది. అధికారులు ఆశించిన విధంగా బకాయిలు వసూలు కాలేదు. వినియోగదారులు ఓటీఎస్‌ను అంతగా సద్వినియోగం చేసుకోలేదు. ప్రభుత్వం రెండు నెలల సమయం ఇచ్చినా బకాయిలు చెల్లించలేదు. మొండి బకాయిలు వసూలు చేయడంలో జలమండలి అధికారులకు ఆశించిన ఫలితాలు రాలేదు. మలక్‌పేట డివిజన్‌లో రూ.25కోట్ల పెండింగ్ బకాయిలు రావాల్సి ఉండగా కేవలం రూ.1కోటి57వేలు మాత్రమే ఓటీఎస్ కింద వసూలయ్యాయి. జలమండలి అధికారులు, సిబ్బంది బకాయిల వసూళ్లకు రెండు నెలలు ఇంటింటికీ తిరిగారు. ఫోన్లద్వారా సమాచారం పంపారు. అయినా అనుకున్నమేర ఆదాయం రాలేదు.

నల్లా కనెక్షన్ తొలగిస్తాం



పెండింగ్ బకాయిలు చెల్లించుటకు ఇది మంచి అవకాశం. నల్లా బిల్లులు చెల్లించి ప్రజలు నగర అభివృద్ధికి సహకరించాలి. నల్లా నీరు సరఫరా అవుతున్న ప్రతీ ఒక్క వినియోగదారుడు సకాలంలో బిల్లులు చెల్లించాలి. ఓటీఎస్ గడువు ముగిసిన తర్వాత బకాయి బిల్లులపై స్పెషల్ రైడింగ్ ఉంటుంది. ఎటువంటి సమాచారం లేకుండా నల్లా కనెక్షన్లు తొలగిస్తాం. అంతే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- హష్మత్ అలీ, డీజీఎం మలక్‌పేట


మాట్లాడుతున్న గోరక్ష మహదేవ్ గాడిల్కర్, చిత్రంలో ధనుంజయ్య, గుండా మల్లయ్య తదితరులు

సాయిబాబాపై ఆరోపణలు అవాస్తవం

- గోరక్ష మహదేవ్ గాడిల్కర్

మన్సూరాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): షిరిడీ సాయిబాబా ఒక మతానికి చెందిన వాడని వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, ఇలాంటి ఆరోపణలు చేసిన వారికి తగిన బుద్ధి చెబుతామని షిరిడీ సాయిబాబా సంస్థాన్ సీఈవో గోరక్ష మహదేవ్ గాడిల్కర్ హెచ్చరించారు. షిరిడీ సాయి భక్తఐక్య వేదిక ఆధ్వర్యంలో నాగోల్‌లోని దేవకి కన్వెన్షన్‌లో బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న షిరిడీ సాయిబాబా మందిరాల నిర్వాహక కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సాయినాథుడిపై కొంతమంది అసత్య ప్రచారం చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నారన్నారు. బాబా ఒకే మతానికి చెందిన వాడు కాదని మరాఠీ సచరిత్రలో పేర్కొన్నారని, ఎంతోమంది రుజువు కూడా చేశారన్నారు. సాయిబాబాపై వస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొడుతూ తెలంగాణ వ్యాప్తంగా ఉన్న బాబా భక్తులకు ధైర్యం నింపేందుకు ఏర్పడిన షిరిడీ సాయి భక్త ఐక్యవేదిక అధ్యక్షుడు మంచికంటి ధనుంజయ్య, కార్యదర్శి పీవీ సాయి, కోశాధికారి గుండా మల్లయ్య, ఇతర సభ్యులను ఆయన అభినందించారు.

భక్తుడికే సాయినాథుడి లీలలు తెలుసు

తల్లిదండ్రుల గురించి ఒక బిడ్డకు మాత్రమే ఎలా తెలుస్తుందో, సాయినాథుడిని ఆరాధించే భక్తుడికే ఆయన లీలల గురించి తెలుస్తుందని హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్ పేర్కొన్నారు. షిరిడీ సాయిబాబా మతంను గూర్చి బ్రిటీష్ కాలం నుంచే వచ్చిన అసత్య ప్రచారాల్లో నిజం లేదని ఆధారాలతో చూపారని, బాబా ఒక మతానికి మాత్రమే చెందిన వాడు కాదన్నారు.

అసత్య ప్రచారాన్ని తిప్పికొడదాం

రాష్ట్రంలోని షిరిడీ సాయిబాబా నిర్వహణ కమిటీ సభ్యులంతా ఒక్కటై సాయిబాబాపై అసత్య ప్రచారాన్ని తిప్పి కొడదామని ఐక్యవేదిక అధ్యక్షుడు చింతపల్లిలోని షిరిడీ సాయిబాబా సంస్థాన్‌చైర్మన్ మంచికంటి ధనుంజయ్య పేర్కొన్నారు. అనంతరం అతిథులను ఐక్యవేదిక సభ్యులు ఘనంగా సన్మానించారు. ఐక్యవేదిక సభ్యులు శ్యామ్‌కుమార్, కె.సాయిబాబా, శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, హనుమంతు, వెంకట్రాంరెడ్డి, ఈశ్వరమ్మ యాదవ్, రవీంద్రబాబు, సాయిబాబా, ప్రసాద్‌రావు, హరిప్రసాద్‌రావు, ఖైనంపాటి ప్రసాద్, అనిల్, సాయిశ్రీనివాస్, చంద్రకుమార్, భానుప్రతాప్ పాల్గొన్నారు.

ట్రై సైకిళ్లు, టీచింగ్ కిట్స్ పంపిణీ

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శ్రీనివాసపురంకాలనీలోని ఆల్మికో సంస్థ సహకారంతో శాంతినికేతన్ మానసిక దివ్యాంగ విద్యార్థులకు రూ.17.50 లక్షల విలువ గల ఉచిత ట్రై సైకిళ్లు, టీచింగ్ కిట్స్‌ను బుధవారం వనస్థలిపురం హుడాసాయినగర్‌కాలనీలోని కమ్యూనిటీ హాల్లో పంపిణీ చేశారు. అడిప్ స్కీం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, మినిస్ట్రీఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్ డైరెక్టర్ ప్రదీప్, శాంతినికేతన్ మానసిక దివ్యాంగ పాఠశాల కార్యదర్శి రమేష్, నోడల్‌అధికారి డీడీఆర్సీ, డీజీఎం ఆల్మికో సంజయ్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కొత్తపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎల్బీనగర్ ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం నర్సయ్యగూడెంకు చెందిన కష్టాల కార్తీక్(24) మన్సూరాబాద్ చంద్రపురికాలనీలో ఉంటూ ఫర్నిచర్ షాపులో పనిచేసేవాడు. అతడి తల్లి నాగమ్మ నగరంలోని లైఫ్ స్ప్రింగ్ హాస్పిటల్‌లో పనిమనిషి. మద్యానికి బానిసై అతడు ఫర్నిచర్ షాపులో పని వదిలేసి, ఇంట్లోనే ఉండేవాడు. తల్లి వద్ద అతడు బలవంతంగా డబ్బు తీసుకుని మద్యం తాగేవాడు. ఆమె విధులకు వెళ్లిన తర్వాత ఫోన్‌లో అతడు కోరడంతో అతడికి వంద రూపాయలు పంపింది. ఆ తర్వాత ఆమె అతడి స్నేహితుడైన ప్రశాంత్‌కు ఫోన్‌చేసి, కార్తీక్ ఏం చేస్తున్నాడో ఇంటికి వెళ్లి చూడమని చెప్పింది. ఇంటి తలుపు లోపలి గడియ పెట్టి ఉండడంతో ప్రశాంత్ పొరిగింటి వాళ్ల సాయంతో తలుపు బలవంతంగా తెరచి చూసే సరికి కార్తీక్ చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే అతడు నాగమ్మకు సమాచారం ఇచ్చాడు. ఆమె ఫిర్యాదు చేయడంతో, పోలీసులు అతడి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోల్డ్‌స్మిత్ అదృశ్యం

హయత్‌నగర్ : భార్య, భర్తలు గొడవ పడ్డారు, ఐదు సంవత్సరాలుగా భార్యతో వేరుగా ఉంటున్న భర్త గోల్డ్‌స్మిత్ ఉన్నట్టుండి కనిపించకుండా పోయిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం.. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన గుండోజు రామాచారి కుమారుడు గుండోజు రాజశేఖర్ గోల్డ్‌స్మిత్‌గా పని చేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా ఐదు సంవత్సరాలుగా రాజశేఖర్ తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. ఇటీవల రాజశేఖర్ తల్లిదండ్రులు కూతురు ఇంటికి వెళ్లారు. దీంతో ఒంటరిగా ఉన్న రాజశేఖర్ మనస్థాపానికి గురై ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దీంతో తల్లిదండ్రులు వచ్చి రాజశేఖర్‌కు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ అని వస్తుంది. దీంతో రాజశేఖర్ తల్లి అరుణ హయత్‌నగర్ పోలీసులకు తన కుమారుడు కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.